ఖర్చులకు ఎగబడి...

వివరాలివ్వడంలో వెనుకబడి

- జిల్లా అధికారుల్లో లెక్కలేనితనం
- పెరిగిపోతున్న ఆడిట్ అభ్యంతరాలు



- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1412 పంచాయతీలున్నాయి. పల్లెల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తుంటాయి. వాటిని ఖర్చు చేయడంలో లెక్కలు సరిగ్గా ఉండకపోవడంతో ఏటా 15వేల నుంచి 20వేలకు పైగా ఆడిట్ అభ్యంతరాలు వస్తున్నాయి. రెండుమూడేళ్లకు ఒకసారి, ఐదేళ్లకు ఒకసారి పంచాయతీ అధికారులు బదిలీ కావడం, గతంలో పనిచేసిన వారు చేసిన ఖర్చుకు, వచ్చిన నిధులకు లెక్కలు చూపకపోవడంతో కొత్తగా వచ్చిన వారు తమకేమీ సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారు.
- దేవదాయ శాఖ పరిధిలో ఫైళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.తిరుపతి మినహా మిగిలిన దేవాలయాలకు భక్తులిచ్చే కానులకు లెక్కపత్రాలు సరిగ్గా ఉండడం లేదు. ఆలయాలకు వచ్చిన ఆదాయానికి చేసిన ఖర్చులకు అసలు పొంతన ఉండటం లేదు.
- చిత్తూరు నగర పాలక సంస్థలో రెండు దశాబ్దాలకు పైగా ఆడిట్ అభ్యంతరాలు పేరుకుపోయాయి.
- ద్రవిడ యూనివర్శిటీ విషయానికొస్తే ఇది ఏర్పడినప్పటి నుంచి ఏటా అభ్యంతరాల చిట్టా పెరుగుతూనే ఉంది. నిధులు నీళ్లలా ఖర్చు చేసి సమాధానాలు ఇవ్వడంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో రూ. 1106.54 కోట్లకు సంబంధించి లెక్కలు కనిపించడం లేదు. తాజాగా 232532 ఆడిట్ అభ్యంతరాలకు అధికారులు సమాధానాలు ఇవ్వడం లేదు.

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖలకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు ఖర్చుకు సంబంధించి స్పష్టమైన లెక్కలుండాలి.అయితే చేపట్టిన పనులకు, ఖర్చు చేసిన నిధులకు పొంతన కుదరడం లేదు. ఒక పద్దు కింద విడుదలైతే మరో పద్దు కింద వెచ్చిస్తున్నారు. లెక్కలు సరిగా లేకపోవడంతో ఆడిట్‌శాఖ అభ్యంతరాలు చెబుతోంది. వీటికి ఆయా శాఖలు సరైన ఆధారాలు అందించి పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. ఏ ఏడాదికి సంబంధించిన ఆదాయ వ్యయాలను ఆ మరుసటి ఏడాదిలోపే ఆడిట్ చేసి నివేదికలు అందించాలన్నది ప్రభుత్వ నిబంధన.అయితే దీన్ని ప్రభుత్వ శాఖలు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని పలు కార్యాలయాల్లో ప్రజాధనం వినియోగంపై ఆడిట్‌శాఖ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలకు కొదవ లేదు. ప్రజాధనాన్ని పారదర్శకంగా వినియోగించి వాటి ఆదాయ వ్యయాలు ఎప్పటికప్పుడు ఆడిట్‌శాఖకు వివరించాల్సి ఉంది. చాలా చోట్ల ఆడిట్ అభ్యంతరాలకు సంవత్సరాల తరబడి సమాధానం ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆడిట్ అభ్యంతరాలన్నింటికీ సమాధానాలు ఇస్తేనే ప్రభుత్వం నుంచి నిధుల విడుదలకు మార్గం సుగమమవుతుంది. ఆడిట్ విభాగం అధికారులు పూర్తి స్థాయిలో ఆడిట్ చేసి ఆదాయ వ్యయాల్లోని వ్యత్యాసం, ఖర్చుకు తగిన రసీదులు, చెల్లింపుల్లో అధికం, అనుమతి లేని అడ్వాన్సు చెల్లింపులు, ఇతరత్రా వాటిపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆడిట్ చేసి పేరా వైజ్ రిమార్కులు రాసి అభ్యంతరాలు తెలిపినా సమాధానం సక్రమంగా ఇవ్వడం లేదు.

శాఖ	అభ్యంతరాలు	విలువ (రూ. కోట్లలో)
గ్రామ పంచాయతీలు	213876	91.90
మండల పరిషత్‌లు	7584	30.,48
మార్కెట్ కమిటీలు	829	18.47
చిత్తూరు నగరపాలక సంస్థ	936	279.98
దేవాదాయశాఖ	2945	3.98
ద్రవిడ యూనివర్శిటీ	1946	184.89
జిల్లా పరిషత్	899	387.50
జిల్లా గ్రంథాలయ సంస్థ	1476	28.00
మున్సిపాలిటీలు	2041	81.34
మొత్తం	232532	1106.54

సమాధానాలు ఇవ్వడం లేదు

ప్రభుత్వశాఖల్లో రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేకపోవడం,నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేయడంతోనే ఆడిట్ అభ్యంతరాలు వస్తున్నాయి. ఏ సంవత్సరానికి సంబంధించి ఆడిట్ అభ్యంతరాలను ఆ మరుసటి సంవత్సనాటికి పరిష్కరించుకోవాలి. ఇలా చేయకపోవడంతో పరిష్కరించుకోవాలంటూ ఏటా నాలుగైదు సార్లు రిమైండర్లు పంపుతున్నాం. అయినా అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఆడిట్ అభ్యంతరాల సంఖ్య పెరిగిపోతుంది.

– కృష్ణారెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి

బంగారు రథంపై

మెరిసిన మలయప్ప

వసంత మండపంలో హారతులు





స్వర్ణరథంపై ఊరేగుతున్న ఉత్సవర్లు

వార్షిక వసంతోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఉదయం బంగారు రథంపై దేవేరులతో కలిసి మలయప్ప ఊరేగారు. ఉదయం 8 నుంచి రెండు గంటలపాటు సాగిన స్వర్ణరథోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వసంత మండపంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఉత్సవర్లను అభిషేకించారు. చివరిరోజు శనివారం శ్రీభూదేవి సమేత మలయప్పస్వామితో పాటు రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి, శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవర్లకూ స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి

భానుడి భగభగలు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎండల మంట రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం జిల్లాలో అత్యధికంగా తవణంపల్లెలో 40.6, నగరిలో 40.5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం మండలాల్లో 39.9 డిగ్రీలు, గుడిపాలలో 39.5, చిత్తూరులో 39.4, పులిచెర్ల , పూతలపట్టు, యాదమరి మండలాల్లో 39, నింద్రలో 38.6, బంగారుపాళ్యంలో 38.3, చౌడేపల్లెలో 37.8, గంగాధరనెల్లూరు, ఐరాల, కార్వేటినగరం, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం మండలాల్లో 37.8, బైరెడ్డిపల్లి, గంగవరం, రొంపిచెర్ల మండలాల్లో 37.7, సదుంలో 37.5, గుడుపల్లె , శాంతిపురం మండలాల్లో 37, పెద్దపంజాణిలో 36.9, సోమలలో 36.7, వి.కోటలో 36.1, పలమనేరులో 36, కుప్పంలో 35.8, రామకుప్పంలో 35.3, పుంగనూరులో 34.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఎండల దెబ్బకు జనసంచారం కరువైన చిత్తూరు గిరింపేట సర్కిల్



సర్వర్ పనిచేయక పోవడంతో చిత్తూరు ఆర్వో కార్యాలయంలో వేచి ఉన్న కక్షిదారులు

పనిచేయని సర్వర్

- ఇబ్బందుల్లో కక్షిదారులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించి మెయిన్ సర్వర్ వారం రోజులుగా సరిగ్గా పనిచేయడం లేదు. ఈ కారణంగా చిత్తూరు ఆర్వో కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు సరిగ్గా జరగక కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయవిక్రయదారులు కార్యాలయం దగ్గర గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరైతే రిజిస్ట్రేషన్లు చేసుకోకుండానే వెనుదిరిగి వెళ్లిపోతున్నారు.

నేడు కూడా రిజిస్ట్రేషన్లు : రిజిస్ట్రేషన్లు, స్టాంపులశాఖ శనివారం సెలవు రోజైనా పనిచేస్తుందని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి తెలిపారు. చిత్తూరు ఆర్వో కార్యాలయంతోపాటు మిగిలిన ఏడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. కక్షిదారులు రిజిస్ట్రేషన్లు, స్లాట్ బుకింగ్‌లు చేసుకోవచ్చని సూచించారు.

మామిడి రైతుల ప్రయోజనాలకు పెద్దపీట

- ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ డైరెక్టర్
- గిట్టుబాటు ధర, ఉత్పత్తులు, ఎగుమతులపై సాగిన సదస్సు



'కాల్‌గుడి ఎఫ్‌పీవో'తో ఒప్పందం కుదుర్చుకుంటున్న అధికారులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మామిడి రైతుల ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ గ్రీన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక ఎన్‌పీసీ పెవిలియన్ కన్వెన్షన్ సెంటర్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన చేపట్టిన మామిడి రైతులు, కొనుగోలుదారులు, విక్రయదారులతో సదస్సును ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. మామిడి సాగుతోపాటు ఉద్యాన పంటల ఉత్పాదకత, మార్కెటింగ్, ప్రాసెసింగ్, గిట్టుబాటు ధరపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. 1.12 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలు చేయడంతో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. జిల్లాలో మామిడి పెంపకం, తెగుళ్ల నివారణపై శాస్త్రజ్ఞులతో పరిశోధనలు చేయిస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మామిడికి గిట్టుబాటు ధర, మార్కెటింగ్, మ్యాంగో ఉత్పత్తుల ఎగుమతుల రంగాలను మెరుగుపర్చాల్సి ఉందని చెప్పారు. జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి దేశం నుంచి పలువురు రావడం శుభపరిణామమన్నారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ..జిల్లాలోని మామిడి ఉత్పత్తులకు టీటీడీ కొనుగోలు చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. తిరుమలకు నడక దారిన వెళ్లే భక్తులకు ఇస్తున్న ఉచిత భోజనం, పాలు, మజ్జిగతోపాటు జిల్లాలో తయారుచేసే మామిడి ఉత్పత్తుల్లో ఒకటైన మ్యాంగో జ్యూస్ అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అసెంబ్లీ వేదికగా జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలనే తమ గళాన్ని వినిపించినట్లు గుర్తుచేశారు. అంతకుముందు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రముఖులు పరిశీలించారు. ఉద్యాన శాఖ అదనపు సంచాలకుడు హరినాథ్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ మైక్రో ఇరిగేషన్ వెంకటేశ్వర్లు, జేడీ దేవమునిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, ఆలిండియా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల చైర్మన్ జైట్లీ, చెన్నకేశవులు, బాబు, జగదీశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

'కాల్‌గుడి ఎఫ్‌పీవో'తో ఒప్పందం

సదస్సు ప్రారంభంలో ఈకామర్స్ ద్వారా మామిడి, ఉద్యాన ఉత్పత్తులు అమ్మకాలు చేపట్టడంపై హైదరాబాదుకు చెందిన 'కాల్‌గుడి ఎఫ్‌పీవో' కంపెనీ ప్రతినిధులతో వేదికపై రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్ కుమార్ ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం ఐదు సెషన్లలో మామిడి పంట సాగు, వాతావర ప్రతికూల పరిస్థితుల్లో పంటను కాపాడుకోవడం, వాటి తెగుళ్ల, నివారణ, సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు సూచనలు చేశారు.

ఇలాంటి సదస్సులతో ప్రయోజనం



ఎనిమిది ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నాను. ఇలాంటి సదస్సులతో రైతులకు ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నాను. భవిష్యతులో మామిడి రైతులకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాను.

– ప్రభాకర రెడ్డి, జీడీ నెల్లూరు మండలం

గిట్టుబాటు ధర లేదు



రెండు ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నాను. ప్రతి ఏటా సాగు కోసం పెట్టుబడి ఎక్కువవుతున్నా.. గిట్టుబాటు ధర దక్కడం లేదు. రైతులకు నష్టం రాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి.

– వాసుదేవరెడ్డి, గంగవరం మండలం

ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి



మామిడి రైతులకు పనిముట్లు, కవర్లు, పురుగుమందులు, తదితరాలను ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వాలి. అపుడే రైతులకు కొంత ప్రయోజనం చేకూరుతుంది. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– సిద్ధయ్యనాయుడు, గుడిపాల మండలం

'మనమిత్ర వాట్సాప్'లో ఇంటర్ ఫలితాలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 15,639 మంది, సెకండియర్‌లో 15,074 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్‌లోనూ అందుబాటులో ఉంచనుంది. ఇందుకోసం 95523 00009 వాట్సాప్ నెంబరుకు హాయ్ అని పెడితే సెల్‌ఫోన్‌లోనే ఫలితాలు చూడొచ్చు.

సీనియారిటీ జాబితాలో అభ్యంతరాల స్వీకరణకు గడువు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నాల్గవ జోన్ పరిధిలోని ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లు గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టుల పదోన్నతికి తాత్కాలిక సీనియారిటీ జాబితాను ఆర్జేడీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. అభ్యంతరాల స్వీకరణ శుక్రవారం నాటికి ముగియడంతో గడువును ఈనెల 16వ తేదీవరకు పొడిగించినట్లు డీఈవో తెలిపారు.



రఘురామకృష్ణరాజు, గురజాల జగన్మోహన్



ద్వారక తిరుమలరావు



రాణీ కుముదిని, నీలం సాహ్ని



జస్టిస్ సంతోష్‌రెడ్డి

శ్రీవారి సేవలో ప్రముఖులు

ఏపీ శాసనసభ డిప్యూటీస్పీకర్ రఘురామకృష్ణ రాజు శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా అభిషేక సేవలో పాల్గొని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్‌రెడ్డి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇంకా ఏపీ, తెలంగాణ ఎలక్షన్ కమిషనర్లు నీలం సాహ్నీ, రాణీ కుముదిని, బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఆర్టీసీ ఎండీ ద్వారకతిరుమలరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, తెలంగాణ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కూడా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం : రూ.3.94 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 57,462

తలనీలాలు సమర్పించినవారు : 22,998





షాపులో పల్లింటి చంద్రశేఖర్

ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా..

వైకల్యాన్ని కాదని స్వావలంబన

మరో ముగ్గురు మహిళలకూ ఉపాధి

పుత్తూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వైకల్యానికి కుంగిపోలేదు. ఆత్మన్యూనతతో వెనుకంజ వేయలేదు. చేయూత కోసం ఎదురుచూడలేదు. ఆత్మవిశ్వాసాన్ని కూడకట్టుకున్నాడు. అదే పెట్టుబడిగా ముందడుగు వేశాడు. మరో ముగ్గురికి ఉపాధి చూపే స్థాయికి ఎదిగాడు. స్వయంకృషికి చిరునామాగా నిలిచాడు. అతడే పుత్తూరుకు చెందిన పల్లింటి చంద్రశేఖర్. పుట్టుకతోనే పోలియోబారిన పడ్డాడు. రెండు కాళ్లూ సరిగా పనిచేయవు.అడుగులు వేయడం కష్టమైనా చిన్నప్పుడు స్కూలుకు వెళ్లేవాడు. పరిస్థితుల ప్రభావంతో ప్రాథమిక విద్యతో ఆపేయాల్సి వచ్చింది. తండ్రికి కొద్దిపాటి వ్యవసాయముంది. అతనికి చేదోడువాదోడుగా నిలిచాడు. వయసు మీరుతున్న తండ్రికి భారం కాకూడదని భావించాడు. స్వయం ఉపాధితో స్వావలంబన సాధించాలని సంకల్పించాడు. ఈక్రమంలో కొన్నాళ్ల క్రితం ఇడ్లీ పిండి మిషన్‌ను ప్రారంభించాడు. తల్లిదండ్రులు తోడుగా నిలిచారు. తర్వాత మరో అడుగేసి గోధుమలు, రాగులు, బియ్యం, మిరపకాయల పిండి మిషన్లతో వ్యాపారాన్ని విస్తరించాడు. పదుగురి ఆరోగ్యానికీ మేలు చేయాలని వేరుశనగ, నువ్వుల మర గానుగలను, నూనె ఫిల్టర్లను ప్రారంభించాడు. స్వచ్ఛమైన గానుగ నూనెలూ, కల్తీ లేని పిండిలు దొరికే ప్రాంతంగా పుత్తూరులో చంద్రశేఖర్ ప్రజల విశ్వాసాన్ని పొందగలిగాడు. ముఖ్యంగా గానుగ నూనెను జనం ఆదరించారు. అంతేకాదు గోధుమ, రాగి, శనగ, జొన్న, సజ్జ, ధనియాలు, మిరప, పసుపులాంటివీ విక్రయిస్తున్నాడు. ఇటీవల తండ్రి చనిపోయాడు. వృద్ధురాలైన తల్లిని పోషిస్తున్నాడు. ఇప్పుడు ఇతడితో పాటు మరో ముగ్గురు మహిళలు పనిచేస్తున్నారు. సమయపాలన, క్రమశిక్షణలను పాటించే అరవయ్యేళ్ల చంద్రశేఖర్ తన కాళ్లమీద తాను నిలబడి మరోముగ్గురికి ఉపాధినిస్తున్న తీరు స్ఫూర్తిదాయకమనడం నిస్సందేహం.

మహిళా విద్యకోసం జ్యోతిరావు పూలే కృషి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళల విద్య కోసం జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని జేసీ శుభం బన్సల్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బాలాజీకాలనీలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ స్త్రీలకు విద్య అవసరాన్ని గుర్తించి ఆ దిశగా జ్యోతిరావు పూలే కృషి చేశారన్నారు. సామాజిక సంస్కరణలకు నాంది పలికారన్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ సదాశివం మాట్లాడుతూ జ్యోతిరావ్‌పూలే చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. అనంతరం వివిధ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు రూ.14.31కోట్ల రుణాల మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మదనమోహన్, చంద్రన్న, చెన్నారెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జేసీ శుభం బన్సల్



తుంబుర తీర్థానికి వెళ్లే దారిలో సేద తీరుతున్న భక్తులు

తుంబుర తీర్థానికి తరలిన భక్తులు

తిరుమల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): తిరుమల తుంబురతీర్థానికి శుక్రవారం భక్తులు తరలివెళ్లారు. ఏటా శ్రీవారి ఆలయానికి ఏడున్నర మైళ్ల దూరం వెలసిన తుంబురతీర్థ ముక్కోటిని నిర్వహించడం ఆనవాయితీ. నిజానికి శనివారం తుంబుర తీర్థ ముక్కోటి అయినప్పటికీ, ఆ ఘడియలు ముందుగా ప్రారంభం కావడంతో శుక్రవారం కూడా భక్తులను తీర్థానికి అనుమతించారు. తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులూ తీర్థానికి వెళ్లి స్నానాలు ఆచరించి, తుంబురనాథుడికి పూజలు నిర్వహించారు. భక్తుల కోసం పాపినాశనం వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు, భద్రతను టీటీడీ ఏర్పాటు చేసింది. శనివారం ఉదయం 5 నుంచి 10 గంటల వరకు భక్తులను తీర్థానికి అనుమతించనున్నారు.

నేడు సీపీటీ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి జరగనున్న ఏపీపీఎస్సీ కంప్యూటర్ - కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు(సీపీటీ)కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. పుత్తూరులోని వెంకటేశ పెరుమాల్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శని, ఆదివారాలు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. 600 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, రామాజీ పాల్గొన్నారు.

కడప మార్గం మూసివేత

● భాకరాపేట వైపు వాహనాల దారి మళ్లింపు



కొత్త చెక్‌పోస్ట్ కూడలిలో బ్యారికేడ్లు పెట్టిన పోలీసులు

రేణిగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణ మహోత్సవం నేపథ్యంలో రేణిగుంట, కరకంబాడి నుంచి కడప వైపు వెళ్లే రోడ్డు మార్గాన్ని శుక్రవారం సాయంత్రం పోలీసులు మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. ఒంటిమిట్ట ఆలయం ప్రధాన రహదారి పక్కనే ఉండటం.. సీఎం చంద్రబాబు హాజరవుతుండటం.. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు భారీ వాహనాలను ఆపేశారు. రేణిగుంట కొత్త చెక్ పోస్ట్, కరకంబాడి కట్ట పుట్టాలమ్మ ఆలయ సమీపంలో రేణిగుంట, గాజులమండ్యం, తిరుపతి ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి భారీ వాహనాలను భాకరాపేట వైపు దారి మళ్లించారు. శనివారం ఉదయం 9 గంటలకు కడప మార్గాన్ని తెరవనున్నారు.

హలో.. జంప్ చేస్తా



తిరుపతి నగరం లీలామహల్ కూడలిలోని గరుడ వారధి తొలి అంతస్తు సైడ్‌వాల్‌పై శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కూర్చొని జంప్ చేస్తానంటూ హల్‌చల్ చేశాడు. వద్దంటూ జనం కేకలు వేశారు. పోలీసులకు సమాచారమిచ్చారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

20లోగా టీడీఆర్ బాండ్లు గిఫ్ట్ డీడ్ దశకు రావాలి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనరు మౌర్య

తిరుపతి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): అన్ని టీడీఆర్ బాండ్లు ఈ నెల 20వ తేదీ లోపు గిఫ్ట్ డీడ్ దశకు రావాలని, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. టీడీఆర్ బాండ్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, నమోదు తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. టీడీఆర్ బాండ్ల మేళాను శుక్రవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఆన్‌లైన్ అయ్యాయి? ఎవరెవరి దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు. ఆయా మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన అధికారులు ప్రజలకు ఫోను చేసి వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. సెలవు రోజుల్లోనూ ఆన్‌లైన్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీసీపీ. మహాపాత్ర, ఏసీపీలు బాలాజి, మూర్తి, టీపీబీవోలు, రోడ్డు ఇంచార్జులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మూతపడ్డ 'జనఔషధి'

● రాయితీతో మందుల దొరక్క రోగుల అవస్థలు



తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 'ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రం' పేరిట గతంలో స్విమ్స్‌లోని ఓపీ విభాగం లోపల ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణం వారం కిందట మూతపడింది. గడువులోగా పునరుద్ధరణకు చర్యలు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ దుకాణంలో 50-70 శాతం రాయితీతో జనరిక్ మందులను ఇస్తారు. వాటిని ఎలా వాడాలి? వాటి ఉపయోగాల గురించి చెప్పేందుకు ప్రత్యేకంగా ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. బయట మార్కెట్ ధరల కంటే అతి తక్కువ ధరల్లో మందులు లభ్యమవుతుండటంతో దూర ప్రాంతాల రోగులు నెలకు సరిపడా మందులను కొనుగోలు చేసి వెళ్లేవారు. ఈ దుకాణంలో రోజుకు రెండు వేల మందికిపైగా రోగులు మందులు కొనేవారు. రోజుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విక్రయాలు జరిగేవి. గతంలో స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్లో స్విమ్స్‌లోని జనరిక్ మందుల దుకాణం గురించి ప్రశంసించారు కూడా. ఈ దుకాణం గడువు ముగిసిందంటూ వారం కిందట మూత పడింది. దీంతో రాయితీ మందులు దొరక్క రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడువు ముగియకముందే కొనసాగింపు ప్రక్రియ చేపట్టి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రం పేరుతో జనరిక్ మందుల దుకాణాలు కొనసాగుతున్నా కేవలం స్విమ్స్‌లోనే మూతపడింది.


సంస్కృత భాష సంరక్షణకు కృషి

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సంస్కృత భాష సంరక్షణకు, సనాతన ధర్మ పరిరక్షణకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురుకుల విశ్వనాథ ధ్యాన మందిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా శివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గురుకుల పద్ధతిలో అధ్యయన-అధ్యాపనం, శాస్త్ర పరిరక్షణకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. వైవిధ్యమైన పాఠ్యాంశాలను విశ్వవిద్యాలయం ద్వారా విద్యార్థులకు అందించడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కంచి కామకోటి పీఠాధిపతి





యజ్ఞోపవీత ధారణ



స్వర్ణకిరీటం



కల్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.




కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు




ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం





సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు



సచివాలయాలకు కొత్త రూపు

● జనాభా ప్రాతిపదికన వర్గీకరణ

● మిగులు ఉద్యోగులు 525 మంది

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలను ప్రభుత్వం హేతుబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.సచివాలయాలను జనాభావారీగా విభజించి అందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యలోనూ మార్పు చేసింది. జిల్లాలో 612 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిని జనాభా ప్రాతిపదికన విభజించి సిబ్బందిని హేతుబద్ధీకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసింది.2500 లోపు జనాభా ఉంటే ఇద్దరు సిబ్బంది, 2501 నుంచి 3500 వరకు జనాభా ఉంటే ముగ్గురు, 3500కు పైగా జనాభా వుంటే నలుగురు సిబ్బందిని కేటాయిస్తారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లా అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఏబీసీ కేటగిరీలవారీగా జిల్లాలోని 4432 సిబ్బందిని విభజిస్తారు. దీంతో ఎంతమంది సచివాలయాల్లో ఉంటారు, మిగిలిన వారిని ఏ శాఖకు కేటాయిస్తారన్న చర్చ మొదలైంది. జనరల్ కేటగిరిలో మొత్తం 2448 మంది ఉద్యోగుల్లో 525 మంది మిగులు ఉన్నట్లు 1923 మంది పనిచేస్తున్నట్లు గుర్తించారు. మిగులులో వార్డు సచివాలయాల్లో 52 మంది, గ్రామ సచివాలయాల్లో 473 మంది ఉన్నట్లు తేల్చారు. ఇది కాకుండా టెక్నికల్ కేటగిరిలో వీఆర్వోలు, విద్యుత్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతరత్రా విభాగాల్లో ఎందరు పనిచేస్తున్నారు. వారిలో ఎంతమంది మిగులున్నారో అధికారులింకా తేల్చలేదు. కాగా మిగులుగా గుర్తించిన 525 మంది ఉద్యోగులను ఆయా ప్రభుత్వశాఖల్లో విలీనం చేస్తారా... లేదా అన్న దానిపై స్పష్టత రావాల్సివుంది. ఉద్యోగుల సర్దుబాటు విషయంలో త్వరలో మార్గదర్శకాలు జారీకానున్నాయి.

వార్డు సచివాలయాల వివరాలు

జనాభా ప్రాతిపదికన కేటగిరి

	ఏ (2500 లోపు)	బి (2501 - 3500)	సి (3501 పైగా)
● వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు			
పనిచేస్తున్నవారు	07	38	63
మిగులు	----	----	----
● వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ			
పనిచేస్తున్నవారు	----	38	63
మిగులు	02	01	----
● సంక్షేమ, విద్య సహాయకులు			
పనిచేస్తున్నవారు	111	193	170
మిగులు	28	02	----
● వార్డు మహిళా పోలీసు			
పనిచేస్తున్నవారు	02	01	63
మిగులు	05	37	----
● మొత్తం	పనిచేస్తున్నవారు 380		మిగులు 52

గ్రామ సచివాలయాల వివరాలు

జనాభా ప్రాతిపదికన కేటగిరి

	ఏ (2500 లోపు)	బి (2501 - 3500)	సి (3501 పైగా)
● డిజిటల్ అసిస్టెంట్			
పనిచేస్తున్నవారు	64	195	179
మిగులు	75	----	----
● పంచాయతీ కార్యదర్శి			
పనిచేస్తున్నవారు	75	195	170
మిగులు	64	----	----
● సంక్షేమ, విద్య సహాయకులు			
పనిచేస్తున్నవారు	111	193	170
మిగులు	28	02	----
● మహిళా పోలీసు			
పనిచేస్తున్నవారు	28	02	170
మిగులు	111	193	----
● మొత్తం	పనిచేస్తున్నవారు 1543		మిగులు 473

● ప్రత్యేక మార్గదర్శకాలు

వార్డు సచివాలయాల్లో 10క్యాడర్లు, గ్రామ సచివాలయాల్లో 12క్యాడర్లు ఉన్నాయి. వార్డు సచివాలయంలో పరిపాలన, సంక్షేమం, మహిళా కార్యదర్శి, గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, విద్యాసంక్షేమం, మహిళా సంరక్షణ కార్యదర్శి క్యాడర్లపై ప్రభావం చూపనుంది. మిగులు ఉద్యోగుల సంఖ్య ఈ క్యాడర్‌లోనే ఉంటుంది.

అమలు దిశగా హామీలు

ఎమ్మెల్యే జగన్మోహన్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చిత్తూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): టికెట్టు పొందిన తక్కువ సమయంలోనే ప్రజలకు చేరువై ఎన్నికల్లో గెలిచిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్.. ఈ 10 నెలల కాలంలో చిత్తూరు అభివృద్ధిలో తన ముద్ర వేశారు. ఓవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రయత్నిస్తూనే.. మరోవైపు హామీలు ఇవ్వని పనుల మీదా దృష్టి సారిస్తున్నారు. హామీల తాజా పరిస్థితితో పాటు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి గురించి ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో సంభాషించారు.

● శరవేగంగా అడవిపల్లె రిజర్వాయర్ పనులు

అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు నీళ్ల తీసుకొచ్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సీఎంతో మాట్లాడి రిజర్వాయర్ నుంచి 0.785 టీఎంసీల నీళ్లను చిత్తూరుకు కేటాయిస్తూ ఉత్తర్వులు తెచ్చుకున్నాం. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర కమిటీ సభ్యులు మంగసముద్రంలోని 15 ఎకరాలను పరిశీలించి వెళ్లారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సెంట్రల్ స్కూల్ ప్రారంభమయ్యే అవకాశముంది. టిడ్కో గృహాల్లో విద్యుత్తు, నీటి సౌకర్యాలను ఏర్పాటుచేసి లబ్ధిదారులకు అందిస్తాం.

● పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

పరిశ్రమల ఏర్పాటులో భాగంగా చీలాపల్లె సీఎంసీ ఎదురుగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు 25 ఎకరాల్ని గుర్తించారు. భారత్ బయోటెక్ కంపెనీ వారితో చర్చిస్తున్నాం. ఇక్కడ సుమారు 5 వేల మందికి ఉపాధి లభిస్తుంది. న్యూట్రిన్ ఫ్యాక్టరీ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి ప్రత్యక్షంగా 2 వేలు, పరోక్షంగా 3 వేల మందికి ఉపాధి కల్పించనున్నాం.అమూల్‌లో ఇప్పటికే వంద మందికి ఉపాధి దక్కింది. భవిష్యత్తులో ఇక్కడ మరో 400 మందికి ఉపాధి లభించే అవకాశముంది.

● రహదారులపై గుంతల్లేకుండా

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో 36 బోర్లను వేశాం.నియోజకవర్గంలో ఎక్కడా రహదారులపై గుంతలు లేకుండా చేశాం. ఎన్నికల్లో బాగా పనిచేసిన కార్యకర్తలకు ఇచ్చిన మాట ప్రకారం బైకులు, ఆటోలు, సైకిళ్లు, తోపుడు బండ్లు, పానీపూరి బండ్లను పంపిణీ చేశాం.27 నూతన బస్సుల్ని ప్రారంభించాం.ప్రశాంత్ నగర్, చిత్తూరు రూరల్‌లోని ఈద్గాలను, ఫారెస్టు రోడ్డును అభివృద్ధి చేశాం. కైలాస ధామం సిద్ధమవుతోంది. నగరంలో నీటి ఎద్దడి ఉన్న 11 డివిజన్లలో 8 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నాం.

● నిర్వాసితులకు వ్యతిరేకంగా వెళ్లం

చిత్తూరు హైరోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాం. తొలుత జడ్జి అనుమతితో కోర్టు ప్రాంగణాన్ని తీసుకున్నాం. ఎండోమెంటు ఆక్రమణల్ని తొలగించాం. ప్రభుత్వ భవనాల్ని కొట్టేశాం. ఆక్రమణలో ఉన్న కొంత చెరువు పోరంబోకు స్థలాన్నీ తీసుకోవాల్సి ఉంది. మిగిలినవారికి టీడీఆర్ బాండ్లను ఇచ్చేందుకు ఒప్పిస్తున్నాం. ఈ విషయంలో నిర్వాసితులకు వ్యతిరేకంగా వెళ్లను. చట్టప్రకారమే ముందుకెళతాను.

● యూనివర్శిటీ.. గ్యారంటీ

పీవీకేఎన్ కళాశాలను సొంత నిధులు రూ.25 లక్షలు, ప్రభుత్వ నిధులు రూ.25 లక్షలతో అభివృద్ధి చేసి న్యాక్ గ్రేడ్ వచ్చేలా చూశాం. ఇక దాన్ని యూనివర్శిటీగా మార్చడమే తరువాయి. ఇప్పటికే సీఎం చంద్రబాబు వద్ద దాన్ని యూనివర్శిటీగా మార్చాలని కోరాం.

జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుద్దాం

జయంతి వేడుకల్లో వక్తల పిలుపు - బీసీలకు రూ.11.58కోట్ల మెగా చెక్ పంపిణీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే అడుగు జాడల్లో నడుద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో పూలే 199వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ విద్యాధరి మాట్లాడుతూ.. పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. అలాగే ప్రభుత్వం బీసీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. సమాజానికి పూలే చేసిన సేవలను ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వం కూడా బీసీలకు పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం 535 మంది బీసీ లబ్ధిదారులకు రూ.11.58 కోట్ల మెగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బీసీ సంఘ నేతలు అట్లూరి శ్రీనివాసులు, రవి, చోడప్ప, నాగరాజు, భరత్, రవిరాజు, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పూలే విగ్రహానికి కలెక్టర్, బీసీ సంఘాల నేతలు, అధికారులు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.





జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, నేతలు షణ్ముగం, శ్రీనివాసులు తదితరులు - లబ్ధిదారులకు నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్, జేసీ తదితరులు

సూర్యఘర్ అమలుపై కేంద్ర బృందం తనిఖీ



సూర్యఘర్‌పై కేంద్ర అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం నడిమూరులో అమలవుతున్న సూర్యఘర్ పథకాన్ని శుక్రవారం కేంద్ర బృందం తనిఖీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరి నెల మొదటి వారంలో కుప్పం నియోజకవర్గ పర్యటనలో అదే నెల 6వ తేదీన నడిమూరులో సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నడిమూరు గ్రామంలో వందశాతం సోలార్ విద్యుత్తును అందించాలన్న లక్ష్యంతోపాటు నియోజకవర్గం మొత్తం ఈ పథకాన్ని విస్తరించాలన్న ఆశయంతో ప్రారంభమైన ఈ పథకం ప్రస్తుతం అమలులో ఉంది. ఇళ్లపై అమర్చిన సోలార్ ఫలకాలను కేంద్ర బృందం పరిశీలించింది. అలాగే నడిమూరు సచివాలయంలో సూర్యఘర పథకం అమలుకు సంబంధించిన ప్రతిపాదనలు, అమలు తీరుపై గ్రామస్తులను.. అధికారులను ఆరా తీసింది. రికార్డులను పరిశీలించింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రెస్కో అధికారులు వారికి కావాల్సిన వివరాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు శుభదీప్ దాస్, సత్యేంద్ర పాల్గొన్నారు.

టీటీడీలో గోమరణాలంటూ అసత్య ప్రచారం

మాజీ చైర్మన్ కరుణాకర రెడ్డిపై టీడీపీ ఫైర్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో వంద గోవులు మరణించాయంటూ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. వృద్ధాప్యంతోనూ, డెలివరీ సమయంలోనూ, వ్యాధులతోనూ నెలకు సగటున పది ఆవుల వరకు గోశాలలో మృతి చెందుతూ ఉంటాయని చెప్పారు. మూడు నెలల్లో వృద్ధాప్యం, వ్యాధులు వంటి కారణాలతో 40 ఆవులు మృతి చెందడం జరిగిందని వివరించారు. అయితే కరుణాకర రెడ్డి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతినేలా టీటీడీపై ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. గతంలో శ్రీవారిని నల్లరాయితో పోల్చిన ఆయనకు టీటీడీని విమర్శించే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో అలజడి సృష్టించడానికి.. ప్రశాంతతకు భంగం కల్గించడానికి ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ధరణి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

విద్యార్థులకు ఎస్పీ మణికంఠ సూచన







హీరోయిన్ నితీష ప్రసంగం - అప్సరా రాణి నృత్యం - విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

పూతలపట్టు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిస కాకుండా.. బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని విద్యార్థులకు ఎస్పీ మణికంఠ సూచించారు. శుక్రవారం పూతలపట్టు మండలం ముత్తిరేవుల సమీపాన ఉన్న శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల (ఎస్వీసెట్)లో రెండో రోజు సెలెస్టా 2కె25 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడే కష్టాన్ని గుర్తించి బాగా చదువుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ రావూరి వెంకటస్వామి, వైస్‌చైర్మన్ రావూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథం రెడ్డి, రాజారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సందడి చేసిన హీరోయిన్లు

సెలెస్టాలో భాగంగా నేపాల్‌కు చెందిన సినీ హీరోయిన్ నితీషతోపాటు రాచరికం సినిమా హీరోయిన్ అప్సరా రాణి శుక్రవారం సందడి చేశారు. వీరు వేదికపై రావడంతో విద్యార్థుల కేరింతలు, చప్పట్లతో ఆ ప్రాంగణం దద్దరిల్లింది. అప్సరా రాణి వేదిక దిగి విద్యార్థులతో కలిసి సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్ షో, సినీపాటలకు వారు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి.

రైల్వే బ్రిడ్జిలకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

అధికారులకు ఎమ్మెల్యే భానుప్రకాష్ సూచన

నగరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలోని రైల్వే క్రాస్‌ల వద్ద అవసరమైన ఓవర్, అండర్‌బ్రిడ్జిల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచించారు. బ్రిడ్జిలు నిర్మించే ప్రాంతంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా లైట్ వెహికల్ కోసం సబ్‌వేలు ఏర్పాటు చేయాలన్నారు. శుక్రవారం ఈ మేరకు తిరుపతిలో అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వే లెవల్ క్రాస్ (49) వద్ద ఓవర్‌బ్రిడ్జి, పుత్తూరు రైల్వే క్రాస్ (55) మరాఠిగేటు వద్ద అండర్‌బ్రిడ్జి, పుత్తూరు ఆర్‌డీఎం రైల్వేక్రాస్ (56) వద్ద ఓవర్ బ్రిడ్జి, వడమాలపేట మండలం పూడిక్రాస్ (67) వద్ద ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో పూర్తి చేస్తామన్నారు. చిత్తూరు, తిరుపతి ఆర్అండ్‌బీ ఈఈలు శ్రీనివాసులు, మధుసూదన్, పుత్తూరు డీఈ అమర్‌నాథ్ పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(డీవీఎంసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఎస్పీ మణికంఠ, డీఆర్వో మోహన్‌కుమార్, సాంఘిక సంక్షేమం, సాధికారిత అధికారి చెన్నయ్య పాల్గొన్నారు. గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలు, తీసుకున్న చర్యలను వివరించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. పుంగనూరు గురుకుల పాఠశాలలో 113 మంది విద్యార్థులకు నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, వారి అవసరాలకు సరిపోవడం లేదన్నారు. సోమల మండలంలో యానాదుల అనుభవంలో ఉన్న భూములను అగ్రకులస్తులు ఆక్రమించుకున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన ఎస్టీ కళాకారులకు పించన్లను మంజూరు చేయాలని, గతంలో నెల చివరి శనివారం ఎస్సీ, ఎస్టీలకే ప్రత్యేకంగా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించేవారని, ప్రస్తుతం కూడా అమలు చేస్తే బాగుంటుందని సభ్యులు కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యలను పరిశీలించి.. న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు 21 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, బాధితులకు తక్షణ సాయం కింద రూ.17.25 లక్షల పరిహారం ఇచ్చామన్నారు. డీవీఎంసీ సభ్యులు మునీంద్ర నాయక్, శేషాద్రి, ధనశేఖర్, వరలక్ష్మి, దళిత సంఘాల నేతలు రాజ్‌కుమార్, భారతి, మునస్వామి, రవి పాల్గొన్నారు.



డీవీఎంసీ సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సీఎంఆర్ఎఫ్ సాయం పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):కుప్పం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేశారు. కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ, కనమపచ్చార్లపల్లె గ్రామానికి చెందిన పుష్పరాజ్ కుమారుడు దినేష్‌కు రూ.లక్ష విలువ గల చెక్కును అందించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు చెక్కునత్తం మణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీల వేతనం రూ.18 వేలకు పెంచాలి



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

పలమనేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో (మెప్మా) పనిచేస్తున్న రిసోర్సు పర్సన్ల శ్రమను గుర్తిం చి ప్రభుత్వం సరైన ప్రోత్సాహం ఇవ్వాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆర్పీల కాలపరిమితిని రద్దుచేయాలని, ప్రస్తుతం ఇస్తున్న రూ.8 వేల గౌరవ వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని కోరారు. ప్రధానంగా మహిళా వికాస్ యాప్‌తో సంఘ సభ్యులతో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని.. ఆ యాప్‌ను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఆర్పీలు ధనలక్ష్మి, జ్యోత్స్న, షకీలా బేగం, కస్తూరి, లావణ్య, గాయత్రి, జమున, శ్యామల, జరీనాపాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



ప్లాస్టిక్ కవర్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలమనేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని, ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని మున్సిపల్ సిబ్బంది శుక్రవారం పలమనేరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ దినసరి కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులను కలిసి ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో కలిగే అనర్థాలను వారికి వివరించారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు, జరిమానా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్.ఓ రవిరెడ్డి, మున్సిపల్ శానిటరీ అధికారి ఎం.శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాలలో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంతో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులపై చదువుల భారం తగ్గించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు ఆసరాగా నిలవాలన్న సదాశయంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు జగదీశ్‌బాబు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు భవన నిర్మాణాలకు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు భవన నిర్మాణపు పనులకు ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు భూమి పూజ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు శ్రీనివాసులు రెడ్డి, రామ్మూర్తి, నాగభూషణం, కుమార్, మనోహర్, కృష్ణారెడ్డి, భువన్, విశ్వనాథరెడ్డి, తుమ్మిశినాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే టీడీపీలో గుర్తింపు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారిని పార్టీ గుర్తిస్తుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బంగ్లాలో జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పని చేసిన వారిని కచ్చితంగా గుర్తించి పదవులు ఇస్తుందన్నారు. పార్టీలో ఉంటూ కోవర్టులుగా పని చేసిన వారికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. బీజేపీ, జనసేన పార్టీ నాయకులను కలుపుకుని పార్టీ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే కలిసి మాట్లాడుకోవాలని, వాటిపై ఘర్షణలకు దిగడం, ఒకరిపై ఒకరు విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, సీవీరెడ్డి, వెంకటముని యాదవ్, పోలీసు గిరి, రామకృష్ణమరాజు, శమిపతి, సుహేల్‌బాషా, దేశాది ప్రకాశ్, సుబ్రహ్మణ్యంరాజు, అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం, సద్దాంహుసేన్, రామయ్య, గంగాధర్, రమణ, లక్ష్మణరాజు, చంద్ర, ప్రసాద్, నౌషాద్, ఇమ్రాన్, జనసేన నాయకులు విరూపాక్షి, చైతన్యరాయల్, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందించాలి



బైరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న అధికారులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మీదుగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూములు కోల్పోతున్న తమకు తగిన నష్టపరిహారం అందజేసి ప్రభుత్వం న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. శుక్రవారం రహదారి పనులను పరిశీలించడానికి వచ్చిన రెవెన్యూ, పోలీసు అధికారులతో తమ సమస్యను విన్నవించారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఎంతో విలువైన భూములను రోడ్డు పనుల కోసం ఇవ్వాలంటే తమకు సంతృప్తికరంగా ఉండేలా నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని నచ్చజెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

సోమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డివారిపల్లె పంచాయతీ ఎర్రంవారిపల్లె సమీపంలోని పొలం వద్ద ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు. శుక్రవారం సాయంత్రం పోలీసులకు అందిన సమాచారంతో జూదం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

నేత్రపర్వం.. పార్వతీ పరిణయం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రామకుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాల్లో ఒకటైన పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 7.30 గంటలకు వేదపండితులు పార్ధంది సందీప్‌శర్మ, పార్ధంది నాగరాజుశర్మ ఆధ్వర్యంలో పురోహిత బృందం సర్వాలంకార శోభితులైన అన్నపూర్ణాదేవీ, కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవర్లకు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య మాంగల్యధారణ తంతును నిర్వహించారు. ఉభయదారులు జ్యోతీనగరవైశ్య సంఘం వారు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. శనివారం వైభవంగా రథోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కాశీవిశ్వేశ్వరుడికి విశేష అలంకరణ




మాడ వీధుల్లో ఊరేగుతున్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరుడు

రామకుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శుక్రవారం స్వామి వారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక జ్యోతీనగర సంఘం ఆధ్వర్యంలో ఉదయం స్వామికి వేదపండితులు రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం బెంగళూరు నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించారు. అనంతరం సతీ సమేతుడైన కాశీవిశ్వేశ్వర స్వామి ఉత్సవర్లను మేళతాళాలు, డప్పుల హోరు మధ్య మాడ వీధుల్లో ఊరేగించారు.

ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ

కుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-2026కు సంబంధించి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల 30వ తేదీలోపు పూర్తిగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ ఏడాది మార్చి 31 వరకు బకాయిలున్న వారు ఈనెల 30వ తేదీ లోపు చెల్లిస్తే అపరాధ రుసుంలో 50 శాతం రాయితీ పొడిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కుప్పం పురపాలక సంఘ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. అన్ని సెలవు దినాల్లోనూ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కౌంటర్ పనిచేస్తుందని తెలిపారు.

సీతారాములకు అభిషేకాలు



హరికథ చెబుతున్న భాగవతారణి భారతి

సోమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె కోదండ రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలోని మూలవిరాట్‌లకు విశేష అలంకరణలు చేసి అభిషేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయానికి నూతనంగా సీతారాముల ఉత్సవమూర్తులను దాతలు అందజేయడంతో అర్చకులు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఏలూరుకు చెందిన భాగవతారణి భారతి రామాయణంలోని ముఖ్య ఘట్టాలను భక్తులకు పద్య రూపంలో వివరించారు. వాల్మీకి సంఘసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

పొగాకుతో విలువైన జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకంతో విలువైన జీవితాలు నాశనమవుతాయని వైద్యులు పద్మావతి సూచించారు. తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం పొగాకుతో కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. పొగాకు వాడకంతో ఊపిరితిత్తులు దెబ్బతిని జీర్ణకోశ, మూత్రపిండాలు, గర్భాశయ క్యాన్సర్లు, పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయన్నారు. అలాగే వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది రెడ్డెమ్మ, లక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



సోమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవడంతో తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిత తెలిపారు. శుక్రవారం సోమల పంచాయతీలోని దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు.

రామకుప్పం పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రతిపాదనలు



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి తెలిపారు. స్థానిక నేతలతో కలిసి శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, సీతాపతి, రామ్మూర్తి, గుర్రప్ప, జయశంకర్, భూపతి, రామలింగారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, అల్లీశీన పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన తప్పనిసరి

● పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలు, హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి మండల లిఖిత అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్ల డెయిరీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితిలోనూ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. డెయిరీ నుంచి తయారై ప్రజలకు సరఫరా చేసే పాల ఉత్పత్తుల్లో ఎలాంటి కల్తీ ఉండరాదని హెచ్చరించారు. కల్తీరహిత పాల ఉత్పత్తులపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. 14 సంవత్సరాల లోపు వారిని పనిలో పెట్టుకోరాదని సూచించారు. సదస్సులో పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, న్యాయవాదులు అరీఫుల్లాఖాన్, సయ్యద్ ఇస్మాయిల్, పలమనేరు సీఐ నరసింహరాజు, కోర్టు సిబ్బంది, దొడ్ల డెయిరీ సిబ్బంది, కార్మికులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

డిపోల ఎదుట కార్మికుల ధర్నా



కుప్పంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగుల నిరసన



పుంగనూరు డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, కార్యదర్శి జేవీ భాస్కర్, నాయకులు యాగంరెడ్డి, జంపకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో గేట్ వద్ద శుక్రవారం ఎన్ఎంయూఏ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మునస్వామి, ఈ.జయపాల్‌ల ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈహెచ్ఎస్ కార్డు బదులుగా పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలని, దివంగత పి.రామ్మోహన్‌రావు ప్రవేశపెట్టిన ఎస్ఆర్‌బీఎస్ సంక్షేమ పథకం అమలు చేయాలని, గ్యారేజీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారిలో ఉన్న ఆందోళన తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్ఎంయూఏ నాయకులు ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంను కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పీఎస్ఎం వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొట్టు మణి, జి.మునెప్ప, ఎస్వీ నవీన్, టీవీ.కుమార్, దిలీప్ కుమార్, ఎం.బాలకృష్ణ, డి.అరుణ్, ఎస్ఆర్.రాజ, చంద్రనాయక్, బ్రహ్మం, బీఎంవీ.రమణ, బీజీ. నాయక్ పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ రెండో రోజు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిపో మేనేజర్ సుధాకరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు రామకృష్ణ , ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌లైన్‌లోని పాత డ్వాక్రా కార్యాలయంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు 20 ఏళ్ల క్రితం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆలోచనతో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేస్తే అప్పటి రాజకీయ పార్టీలు తప్పు పట్టాయని గుర్తు చేశారు. మహిళలకు దుస్తులు కుట్టేందుకు శిక్షణ ఇస్తున్నారని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఏపీఎం కృష్ణప్ప, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, సీవీరెడ్డి, బి.వెంకటముని యాదవ్, పోలీసు గిరి, రామకృష్ణమరాజు, శమిపతి, సుహేల్‌బాషా, దేశాది ప్రకాశ్, సుబ్రహ్మణ్యంరాజు, సద్దాంహుసేన్, రామయ్య, గంగాధర్, రమణ, జనసేన నాయకులు విరూపాక్షి, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

సోమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయకుండా చెత్తను తొలగించాలని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పొదలకుంట్లపల్లె పంచాయతీలోని తుగడంవారిపల్లె, ఎం. వడ్డిపల్లె గ్రామవీధుల్లోని చెత్తను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. తాగునీటి పైపులైన్ మరమ్మతులు, కుళాయిల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రజా సమస్యలపై వచ్చే వినతులను ఆన్‌లైన్ చేయాలని.. ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి ఫయాజ్, టీడీపీ నాయకుడు బాబూరావ్ తదితరులు పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించకుండా.. తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు సూచించారు. శుక్రవారం పుంగనూరు మండలంలోని చంద్రమాకులపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో లీలామాధవి, ఈవోపీఆర్డీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీకి ఆదాయాన్ని చేకూర్చిన డ్రైవర్లు ఖాన్, అన్వర్, రెడ్డెప్ప, కండక్టర్ సురేష్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పావని, మురళీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

రొంపిచెర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో రోగాలు దూరమవుతాయని.. అన్ని గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి కోరారు. శుక్రవారం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో గ్రామం సమీపంలో ఉన్న పేడ దిబ్బల తొలగింపును ఆయన పరిశీలించారు. ప్రజలు పారిశుధ్యంపై సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిబాబు, కిశోర్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యమని వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన చౌడేపల్లెలోని హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రత, వడదెబ్బ, జ్వరాలపై అవగాహన కల్పించారు. వేసవి సీజన్‌లో అధికంగా నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 నుంచి 3 గంటల మధ్య ఎండలో తిరగరాదని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల బెడదపై దృష్టి సారించాలి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని దళితవాడల్లో దోమలు, కుక్కల బెడద అధికంగా ఉండటంతో అధికారులు వీటిపై దృష్టి సారించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మురికివాడ ప్రాంతాల్లో దోమలు నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. వీధికుక్కలు దాడులు చేస్తున్నాయని.. వాటిని అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి , ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్ రాము, మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి, నాయకులు రామయ్య, కృష్ణానాయక్, శ్రీనివాసులు, నరసింహులు, చంద్ర, సుమిత్రరమణ, నవీన్‌కుమార్, చిన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాడిలో టీడీపీ కార్యకర్తకు గాయాలు

పలమనేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కొలమాసనపల్లి గ్రామంలో శుక్రవారం చీటి వివాదంలో సెల్వరాజు అనే టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు కుమార్, లోకనాథం రాళ్లతో దాడిచేయడంతో సెల్వరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పలమనేరు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

బడుగుల ఆశాజ్యోతి.. జ్యోతిరావు పూలే



కుప్పం: పూలేకు నివాళులర్పిస్తున్న పీఎస్ఎం తదితరులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని.. ఆయన ఆశయాలను నెరవేర్చడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పుంగనూరులో బీసీ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఇందిరా సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● కుప్పం: జ్యోతిరావు పూలే బాటలో బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. అలాగే కుప్పం పట్టణం నేతాజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో పూలేకు నివాళులు అర్పించారు.

● పలమనేరు: జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అలాగే రామకుప్పం, సోమల, రొంపిచెర్ల, శాంతిపురం మండలాల్లో పూలేకు నివాళులు అర్పించారు.



పలమనేరులో పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పుంగనూరులో జ్యోతిరావు పూలేకు నివాళులు

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుమూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పెనుమూరు క్రాస్ నుంచి పెనుమూరు వరకు రోడ్డు పనులు ప్రారంభించారు. మొత్తం 16 కిలోమీటర్ల రోడ్డులో 8 కిలోమీటర్లు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన పనులను కాంట్రాక్టర్ ఆపేశారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా బిల్లులు మంజూరు కాలేదని పనులు ప్రారంభించలేదు. ఈ రోడ్డు గుంతలమయం కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. శుక్రవారం కూడా ఈ రోడ్లను బాగుచేసేదెప్పుడు అనే కథనం ప్రచురితైమంది. స్పందించిన అధికారులు, కాంట్రాక్టరు ఈ రోడ్డు పనులు ప్రారంభించారు.

పరిసరాల శుభ్రతతోనే రోగాలు దూరం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవని జిల్లా మలేరియా నివారణ అధికారి వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం పంట్రాంపల్లె గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బోదకాలు వ్యాధిగ్రస్తులకు డిసేబులిటీ ప్రివెన్షన్ కిట్లను అందజేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, వైద్యాధికారి ఆషా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రోగులకు నిబద్ధతతో వైద్యసేవలందించాలి



ఎండీ, ఎంఎస్ పట్టభద్రులతో అధ్యాపక బృందం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రోగులకు నిబద్ధతతో వైద్యసేవలు అందించాలని ఎండీ, ఎంఎస్ పూర్తి చేసుకున్నా వైద్యులకు అపోలో నాలెడ్జ్ వైస్ ప్రెసిడెంట్ మురళీధరన్ సూచించారు. శుక్రవారం చిత్తూరు అపోలో మెడికల్ కళాశాలలో ఎండీ, ఎంఎస్ పూర్తి చేసుకున్న పట్టభద్రులను యాజమాన్యం సత్కరించింది. అపోలో యూనివర్సిటీ డీన్ వినోద్ బట్ మాట్లాడుతూ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి ఆశయాలను నెరవేరుస్తున్న అధ్యాపక బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అపోలో యూనిట్ హెడ్ నరేష్‌రెడ్డి, వైద్యులు రంగనాథ్, రమ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం: డీఎస్పీ



చిన్నారికి పట్టా అందజేస్తున్న డీఎస్పీ అజీజ్

నగరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. నగరి పట్టణంలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం జరిగిన ప్రీప్రైమరీ, ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏజీఎం శ్రీనివాసులు, టీచర్లు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్‌కు డీఎస్పీ అభినందన

నగరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణానికి చెందిన బాడీబిల్డర్ దినేష్‌ను నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అభినందించారు. పళ్లిపట్టులో నిర్వహించిన పోటీలకు హాజరవడానికి పౌష్టికాహారానికి అవసరమైన ఆర్థిక సాయం గతంలో డీఎస్పీ అందించారు. ఈ పోటీల్లో దినేష్ కప్పు గెలుచుకుని శుక్రవారం డీఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలపగా, ఆయన అభినందించారు.

రీసర్వేకి రైతులు సహకరించాలి

పెనుమూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రీసర్వేకి రైతులు సహకరించాలని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సామిరెడ్డిపల్లె సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు రీసర్వే చేసిన గ్రామంలో తమ భూమి తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఉగ్రాణంపల్లె సప్తగిరి బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ బాషా, రీసర్వే డీటీ వాణి, మండల సర్వేయర్ చిరంజీవి, వీఆర్వో రేవతి పాల్గొన్నారు.

పూతలపట్టు ఎమ్మెల్యేకి తానా ఆహ్వానం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) 24వ సదస్సుకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌కు ఆహ్వానం అందింది. తానా ప్రతినిధి సునీల్ ఎమ్మెల్యేను కలసి శుక్రవారం ఆహ్వాన పత్రిక అందించారు. జూలై మూడు నుంచి ఐదో తేదీవరకు అమెరికాలోని నోవీ మిచిగాన్ ప్రాంతంలో సదస్సు నిర్వహిస్తారన్నారు.

ఇక నరహరిపేటలోనూ బస్టాప్

గుడిపాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇక మీదట నరహరిపేట పోలీసు స్టేషన్ ఎదురుగా ఆర్టీసీ బస్సులను నిలిపేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆదేశాలతో ఆయన తండ్రి చెన్నకేశవులు నాయుడు.. మేనేజర్ రూపతో మాట్లాడారు. చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు గుడిపాల, నరహరిపేట పోలీసుస్టేషన్ వద్ద ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరడంతో ఆమె అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కండక్టర్ రఘునాథనాయుడు, ప్రయాణికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం, శ్రీకావేరిరాజుపురం, వెంగరాజుకుప్పం, నరసింహాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించాల్సి ఉందన్నారు.

వెదురుకుప్పం: శనివారం ఉదయం 10నుంచి 12 గంటల వరకు వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్ఆర్ పురం మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని కార్వేటినగరం ఏడీఈ చంద్రబాబు తెలిపారు.

'మా పాఠశాలలోని విద్యార్థులను ఇతర బడులకు మార్చకండి'

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలోని విద్యార్థులను ఇతర బడులకు మార్చొద్దని తిరువీధికుప్పం సర్పంచ్ వెంకటేశులురెడ్డి, కడపగుంట ఎంపీటీసీ ఉమామహేశ్వరి కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని వారితరఫున ఎంపీటీసీ భర్త గోవిందరెడ్డి ఎంఈవో ఆంజినేయులుశెట్టికిఅందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తిరువీధికుప్పం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తొమ్మిది మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇక్కడినుంచి వేరే బడులకు వెళ్లాంటే రెండు కిలోమీటర్లు దూరంపైగా ఉందన్నారు. అందువల్ల విద్యార్థులను తమ పాఠశాలలోనే ఉంచాలని విన్నవించారు. ఎంఈవోని కలిసిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేలుమొదలి ఉన్నారు.

వైభవంగా కోదండరాముడి రథోత్సవం





చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు వీఆర్, రాజేశ్వరి, వీఎస్ రఘుపతి శెట్టిల ఉభయంతో ప్రత్యేక పూజలు చేశారు. పి.నాగేంద్రప్రసాద్, జగదీష్ కుమార్‌ల ఉభయంతో తోట ఉత్సవం జరిగింది. ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, గిరింపేట గొడుగు మూరులోని శ్రీరామ భజనమందిరంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని స్థానికులు వైభవంగా నిర్వహించారు. గణేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రియల్ ఎస్టేట్ రఘునాథరెడ్డి, దేవరాజుల రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యపై కొనసాగిన వివాదం

ఒకరు ఆస్పత్రి పాలు

విజయపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యపై వివాదం కొనసాగడంతో ఒకరు ఆస్పత్రి పాలయ్యారు. గంగమాంబాపురంలో నాలుగేళ్లుగా గాలి జగదీష్, గాలి బాలానాయుడు కుటుంబాల మధ్య భూ సమస్య ఉంది. ఇరువర్గాలు గతంలో ఘర్షణకుదిగి కేసులు కూడా పెట్టుకున్నారు. శుక్రవారం బాలానాయుడు తల్లి సుందరమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని వివాదంనెలకొన్న భూమిలో దహన సంస్కారాలు చేయాలని గుంతతవ్వారు. సమాచారం తెలుసుకున్న జగదీష్. తహసీల్దార్‌ను కలిసి విషయం చెప్పడంతో ఆయన 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఎస్ఐ రంగా తన సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి భూ వివాదం పరిష్కారమయ్యే వరకు ఇక్కడ దహన సంస్కారాలు చేయొద్దని అడ్డుకున్నారు. బాలానాయుడు వర్గం కూడా తహసీల్దార్‌ను సంప్రదించి రికార్డులు చూపడంతో ఆయన వారికి అనుకూలంగా వ్యవహరించారన్న అనుమానంతో జగదీష్ మనస్తాపానికి గురై పురుగుల మందు తాగేశాడు. ఆయన నగరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని జగదీష్ కుటుంబీకులు ఆరోపించారు. మరోవైపు సుందరమ్మ మృతదేహానికి వేరే ప్రదేశంలో దహన సంస్కారాలు నిర్వహించారు.



ఆస్పత్రిలో గాలి జగదీష్



ఇరువర్గాలకు నచ్చ చెబుతున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

అలరించిన నటరాజ ఉత్సవం



నటరాజ ఉత్సవంలో పాల్గొన్న ఉభయదారులు, అర్చకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్త్రీశ్వరాలయంలో నిర్వహిస్తున్న పంగుణి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజున జరిగిన నటరాజ ఉత్సవం అలరించింది. ఆలయ ఈవో వెంకటరాయలు ఆధ్వర్యంలో పి.వెంకటాచలం నాటర్ ఉభయంతో ఈ ఉత్సవం జరిగింది. భక్తుల శివనామ స్మరణల నడుమ ధ్వజావరోహణం చేశారు. సాయంత్రం బి.సత్యనారాయణ నాటర్, జిల్లా వన్నియకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు కైలాసగిరి రావణ బ్రహ్మ వాహన సేవను నిర్వహించారు. కాళభైరవట్రస్టు వ్యవస్థాపకుడు టి.వెంకటేషన్, లత జ్యువెలరీస్ మల్లి ఆచారి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

రావణబ్రహ్మ వాహనంపై ఆదిదంపతుల విహారం



నగరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం స్వామి, అమ్మవారిని రావణబ్రహ్మ వాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీకృష్ణదేవరాయ బలిజసేవా సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా మల్లేశ్వరుడి కల్యాణోత్సవం



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొట్రకోన గ్రామంలోని పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, ప్రధానకార్యదర్శి యుగంధరాచారి, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల చట్టంపై ఎన్టీఏ హర్షం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయడంపై నోబుల్ టీచర్స్ అసోషియేషన్ (ఎన్టీఏ) జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దీని ద్వారా టీచర్లకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు విజయం సీబీఎస్ఈ స్కూల్లో అసోషియేషన్ సర్వ సభ్య సమావేశానికి టీచర్లు పాల్గొనాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

పూతలపట్టు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తింటి వారి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. అరగొండకు చెందిన హేమను బండపల్లె గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద నివాసం ఉంటున్న హరిబాబుకిచ్చి పెళ్లి చేశారు. ఆ తర్వాత భర్త, అత్త కలిసి హేమను అనుమానిస్తూ వేధించేవారు. దీంతో జీవితంపై విరక్తిచెందిన ఆమె గురువారం అర్ధరాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం హరిబాబు, ఆయన తల్లిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంటువ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అంటువ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు కళాకారులు అవగాహన కల్పించారు. శుక్రవారం బీఎన్ఆర్ పేట గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా బీఎన్ఆర్ పేట సచివాలయం ఆధ్వర్యంలో ప్రజలకు వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం, ఇంటింటి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతపై నాటకం ప్రదర్శించారు.

వరసిద్ధుడి సేవలో వరుణ్‌సందేశ్



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు వరుణ్‌సందేశ్ దంపతులు శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను చేశారు.

పేదలకు అన్నదానం



ప్రకాష్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు, 170 గొల్లపల్లె సర్పంచు కోకా ప్రకాష్ నాయుడు జన్మదిన వేడుకలు శుక్రవారం స్వగ్రామంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నాయకులు సప్తగిరి ప్రసాద్, ఎస్సీ జయప్రకాష్, కోదండయాదవ్, గిరిధర్‌నాయుడు, ఎస్సీ ధరణి, ఎస్సీ విక్రమ్, జనార్దన్ గౌడ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా కేంద్రంలో మామిడి బోర్డు ఏర్పాటు చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోదండయాదవ్ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, తెలుగురైతు అధ్యక్షుడు నాగేశ్వర రావు, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ కోరారు. శుక్రవారం ఎన్‌వీసీ పెవిలియన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి: బీఎస్పీ



కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న బీఎస్పీ నాయకులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని బీఎస్పీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో ఎదుట బీసీ సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ జనాభాలో సగభాగంపైన ఉన్న బీసీలకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రప్ప, జిల్లా నాయకులు విజయకుమార్, నాగరాజు, సురేంద్రబాబు, నాగేశ్వరరావు, లోకనాథం, కార్యకర్తలు పాల్గొన్నారు

వృద్ధురాలికి ఆర్థికసాయం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తగ్గువారిపల్లె పంచాయతీ సాయినగర్‌కు చెందిన వృద్ధురాలైన లలితమ్మ కుమారుడు అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. దాంతో తనకు వచ్చే పింఛనుతో మనవడు, మనవరాలను పోషించడం కష్టంగా మారందని జేసీ విద్యాధరికి మొరపెట్టుకుంది. ఆమె ఆదేశాలతో తహసీల్దారు బాబూ రాజేంద్రప్రసాద్ వృద్ధురాలి పరిస్థితిని చిత్తూరు మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడికి తెలిపారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ సమక్షంలో లలితమ్మకు రూ.పది వేలను అందజేశారు. డీటీ కల్యాణి, మండల సర్వేయర్ లావణ్య పాల్గొన్నారు.

తాగునీటి పైపుల్లో లీకేజీల్లేకుండా చూడండి

పాలసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైపుల్లో లీకేజీల్లేకుండా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి సూచించారు. శుక్రవారం బలిజకండ్రిగ జడ్పీ హైస్కూల్ ముందు భాగంలోని పేడ దిబ్బలను తొలగించారు. ఈవో పీఆర్డీ రమేష్, కార్యదర్శులు సుధాకర్, జయశంకర్ పాల్గొన్నారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే కృషి: ఎస్పీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థ నిర్మూలనకు జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని ఎస్పీ మణికంఠ అన్నారు. పూలే జయంతి వేడుకను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఆపరేషన్ ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్‌బాష, చిన్ని కృష్ణ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ● నగరపాలక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ అముద, సహాయ కమిషనర్ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, పాల్గొన్నారు. ● వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, నేతలు జ్ఞానజగదీశ్, నారాయణ, త్యాగ, ప్రకాష్ పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ: టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు త్యాగరాజన్, చెన్నకేశవనాయుడు, కటారి హేమలత, సీఎం విజయ, వెంకటేష్ యాదవ్, మోహన్‌రాజ్, రాజశేఖర్, ఈశ్వర్, ధరణి ప్రకాష్, శంకర్, విజయ్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: పీసీఆర్ సర్కిల్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి సీపీఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, ఎంపీటీసీ విజయలక్ష్మి, సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, నేతలు చిరంజీవినాయుడు, జయప్రకాష్, ఏకాంబరం, గురుస్వామి,నేతాజీ, హరి పాల్గొన్నారు.

గుడిపాల: 197 రామాపురంలో జరిగిన వేడుకల్లో సీడీపీవో నాగసునంద, బీజేపీ నేత చిట్టిబాబు, మురారి సుధ, ఆనంద్, కుసుమ, కుమారి, లక్ష్మి, మహిళా పోలీసు పావని పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పించిన ఎస్పీ మణికంఠ, సిబ్బంది



పూలే చిత్రపటానికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, హాజరైన నేతలు

సంక్షిప్తంగా..

నేడు హనుమజ్జయంతి

గుడిపాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రఘునాథపురం, నారగల్లు పంచాయతీల పరిధిలోని పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు జరగనున్నాయి. అభిషేకం, అన్నదానం, అఖండదీపోత్సవం, గిరిప్రదర్శన, కోలాటాలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుర్రప్పనాయుడు, మోహన్, కమిటీ సభ్యులు తెలిపారు.

కాణిపాకంలో ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయుడి విగ్రహానికి హారతి ఇస్తున్న సోమశేఖర్ గురుకుల్

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయంలోని వీరాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శుక్రవారం స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఆలయ అర్చక, పండితులు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్లు మణినాయుడు, మోహన్‌రెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, నాయకులు మధుసూదన్‌రావు, హేమాద్రినాయుడు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

పాలసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నిశ్శంకాపురంలో ఆ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చెంగమనాయుడు రూ.4లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా దాతను వెంకటేశులునాయుడు,రవినాయుడు, జె.విజయ్‌కుమార్, రమేష్ నాయుడు, సుబ్బయ్యనాయుడు అభినందించారు.

వృద్ధులకు అన్నదానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం అన్నదానం చేశారు. సుద్దగుంటకు చెందిన డాక్టర్ ఉసురుపాటి వెంకటేశ్వర్లు వితరణతో ఈ కార్యక్రమం జరిగింది.


నేడు మొక్కు తీర్చుకోనున్న కంచర్ల

విజయపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎం.అగరంలోని రామాలయంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సరిత దంపతులు మొక్కు తీర్చుకోనున్నారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని కంచర్ల మొక్కుకున్నారు. ఈ మేరకు నిర్వహించే కల్యాణోత్సవానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరవుతారని స్థానికులు తెలిపారు.

జంతువుల సమస్యలపై దృష్టి పెట్టండి

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల జంతువులకు సంబంధించిన సమస్యలపై దృష్టి పెట్టాలని శుక్రవారం చిత్తూరు యానిమల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఎంహెచ్‌వో లోకేష్‌కు వినతిపత్రాన్ని అందించారు. లైసెన్స్ లేకుండా కుక్కపిల్లలను అమ్మడం, పెంచడం కూడా నేరమన్నారు.

గుట్టకు నిప్పు



గుడిపాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని లక్ష్మీపురం వద్ద గుట్టకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. పొగ కమ్మేయడంతో రోడ్డుపై ప్రయాణించేవారు కొంతసేపు ఆందోళనకు గురయ్యారు. అటవీ అధికారులు ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.